
# * పళ్ల డాక్టర్లు *

ఏదో నవల చదువుతూ మధ్యలో ఎందుకో భర్త అంజనేయులు వంక చూసిన భువనేశ్వరి మండిపడింది.

""ఏం... ఒళ్ళేమైనా చిమ చిమలాడ్తూందా?" అని అడిగింది నవలను పక్కనబెట్టి కయ్యానికి కాలు దువ్వుతూ.




"ఇప్పుడు నిన్ను నేనేమన్నాననే అలా విరుచుకుపడ్తున్నావ్?" కాస్త అయోమయంగా, మరికాస్త అమాయకంగా అడిగాడు అంజనేయులు.

"వేరేగా ఏమైనా అనాలా?... నన్ను వెక్కిరిస్తున్నారు... అది చాల్దా?" గుడ్లురిమి చూసింది భువనేశ్వరి.

"నేనెక్కడెక్కిరిస్తున్నానే బాబూ..." మొత్తుకున్నాడు అంజనేయులు.

"ఓ పక్కన కోతిలా మూతిపెట్టి వెక్కిరిస్తూనే నేనెక్కడ వెక్కిరిస్తున్నానని అంటారా నంగనాచిలా?"

"కోతిలా మూతిపెట్టి వెక్కిరిస్తున్నానా?" ఆశ్చర్యంగా భార్యవంక చూశాడు. అంతలోకే అతనికి ఏదో అనుమానం వచ్చి అద్దం దగ్గరికి పరుగు తీశాడు. అద్దంలో మొహం చూస్కోగానే కెవ్వుమని అరిచాడు అంజనేయులు.

"హిదేంటి?.... అద్దంలో నా మొహం కాకుండా కోతి మొహమేదో కనిపిస్తుందే.... హిహి... ఇదేదో మ్యాజిక్‌లా ఉందేంటీ... హిహిహి..."

అద్దంలోకి చూస్తూ నవ్వసాగాడు ఆంజనేయులు.
"మీ మొహం... మ్యాజిక్ లేదూ పాడూలేదు... అది మీ మొహమే..." అంది భువనేశ్వరి.
"ఆ! ... నిజమా?!...." అద్దంలోకి పరీక్షగా చూశాడు.
నిజమే !... అద్దంలోని ప్రతిబింబంలో కొద్ది కొద్దిగా తన పోలికలు కనిపిస్తున్నాయ్.
"హమ్మో!... హమ్మో!!... నా మూతెంత వాచిపోయిందో!!..."
గుండెలు బాదుకున్నాడు ఆంజనేయులు.
"మీ మూతి ఎందుకు వాచిందసలు? ... నేనెప్పుడూ మీ నెత్తిమీదే కొడ్తాను... లేదా వీపుమీద కొడ్తాను!... అట్లాంటప్పుడు మీ మూతెందుకు వాచింది?..."
భువనేశ్వరి ఆంజనేయులు కాలర్ పట్టుకుంది. "నిజం చెప్పండి... మీకు వేరే ఆడ్దాన్తో సంబంధం ఉంది... అది కూడా మూతిమీద కొట్టే ఆడదాన్తో... అవునా?...." పళ్లు కర కరా కొరికింది.
"బాబోయ్ .... ఇదెక్కడి గోలే నాకూ?... అనవసరంగా నా శీలాన్ని శంకించకే బాబూ... నాకు మూతిమీద కొట్టే ఆడదాన్తో సంబంధం లేదు, ముక్కుమీద గుద్దే ఆడదాన్తోనూ సంబంధంలేదు...." ఘొల్లుమన్నాడు అతను.
"మరైతే మీ మూతెందుకు వాచింది?... చెప్పండి... చెప్పండి... చెప్పండి...." కాలర్ పట్టుకుని ఊపేసింది భువనేశ్వరి.
"నాకు రెండ్రోజుల్నుండీ పంటి నొప్పి ఉంది!... ఆ నొప్పి ఈవాళ ఇంకాస్త పెరిగింది... ఒకవేళ నా మూతి అందుకే వాచిందేమో!..." అని మరోసారి అద్దంలో తన రూపాన్ని పరీక్షగా చూస్కుని "కెవ్"మని అని అరిచి "నేను వెంటనే పళ్ళ డాక్టరుదగ్గరికెళ్లాలి!" అన్నాడు.
"మీరు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు... మన ఇంటి పక్కనే ఓ పెద్ద పళ్ల డాక్టరున్నాడుగా!"
"అతను పళ్ల డాక్టరు కాదే!....ఒళ్ల డాక్టరే!! జనరల్ ఫిజీషియన్...."
"మీ బొంద... పళ్ల డాక్టరు కాదంటారేం? ఆయనికి అంతేసి పెద్ద పెద్ద పళ్లుంటేనూ?..."
కిసుక్ అంటూ నవ్వాడు ఆంజనేయులు.
"పళ్ల డాక్టరంటే పెద్ద పెద్ద పళ్లు ఉండే డాక్టరని అనుకుంటున్నావా? .... కిసుక్ కిసుక్ ... పళ్ల డాక్టరంటే పంటి జబ్బుల్ని నయం చేసే

డాక్టరు." మళ్లీ కిసుక్ అని నవ్వాడు.
"అయినా ఇప్పుడు డాక్టరు దగ్గరికెందుకండీ దండగ!... ఇలా ఉంటేనే బాగుంటుంది... ఎంచక్కా పేరుకు తగ్గట్లు ... ఎవరోగాని పేరుకు తగ్గట్టు ఉండరు... మీరిలానే ఉండిపోండి!!..." గారంగా అంది భువనేశ్వరి.
అంజనేయులు మొహమాటంగా నవ్వాడు.
"నువ్వు చెప్పింది బాగానే ఉందిగానీ.... మరి నాకు నొప్పిగా ఉంది కదా?... ఏనాడూ నీ మాట కాదన్లేదుగానీ... ఈ ఒక్కసారికీ నన్ను వదిలెయ్ .... ప్లీజ్..." అంటూ పెళ్లానికి చెయ్యెత్తి దణ్ణం పెట్టి పళ్ల డాక్టరు దగ్గరికి పరుగుతీశాడు అంజనేయులు.
అంజనేయుల్ని చూడగానే పళ్ల డాక్టరు దంతేశ్వర్రావు భక్తిగా చేతులు జోడించి నమస్కరిస్తూ "ఆహా... అంజనేయా ... ఇన్నాళ్లకు ఈ భక్తుడిని కరుణించావా స్వామీ... ఆహాహా... నా జన్మ ధన్యమైంది స్వామీ..." అన్నాడు అర్ధ నిమీలిత నేత్రాలతో చూస్తూ.
అంజనేయులు కిసుక్కున నవ్వాడు.
"నేను అంజనేయుల్నేగానీ మీరనుకుంటున్న అంజనేయుల్ని కాను స్వామీ... నేను మీ దగ్గరికి వచ్చిన పేషంటుని... పన్ను నొప్పికి మూతి వాచిపోయి మీ కళ్ల కనిపిస్తున్నానన్నమాట... కిసుక్... కిసుక్... కిసుక్..."
అది వినగానే పళ్ల డాక్టర్ దంతేశ్వర్రావు తన బోసినోటిని పూర్తిగా తెరిచి "పుసుక్ పుసుక్" మంటూ నవ్వాడు.
"ఎత్తు మూతేస్కొని వచ్చి భలే బురిడీ కొట్టించావయ్యా నన్ను?... నా కప్పుడే అనుమానం వచ్చింది సుమీ. .. అంజనేయస్వామేంటి ఇట్టా చొక్కా పంట్లాం వేస్కొని రావడమేంటీ అని..."
అంజనేయులు మళ్లీ కిసుక్ మని నవ్వాడు.
"మీరేంటి సార్ ... అద్దంలో నా మొహం చూస్కొని నేనే కన్‌ఫ్యూజ్ అయిపోయాను... ఏంట్రా నాయనా... అద్దంలో కోతి మొహం కనిపిస్తోంది అని"
"సర్లె... సర్లె... కోతుల గురించీ, కొండ ముచ్చుల గురించీ తర్వాత మాట్లాడుకుందాం... ముందు నువ్వు ఈ కుర్చీలో కూర్చో..."అన్నాడు దంతేశ్వర్రావ్.
అంజనేయులు కుర్చీలో కూర్చున్నాడు.
"ఊ... ఇప్పుడు నోరు తెరు..."

"ఆ..." నోరు తెరిచాడు ఆంజనేయులు.
"ఏంటీ?... నువ్వు కృష్ణుడూ నేను యశోదా అని అనుకున్నావా?... విశ్వాన్ని మొత్తం చూపిస్తున్నట్లుగా నోరు అంతిదిగా చాపావ్?... పుసుక్ పుసుక్ (నవ్వు) ...నోటిని అంతెక్కువగా చాపనక్కర్లేదులే... ఇంతకీ ఏ పన్ను నొప్పెడుతుంది?" అడిగాడు దంతేశ్వర్రావ్.
"కుడిపక్కన... పైవరసలోని పన్నండీ..."
వేలు నోట్లో పెట్టి పెదాన్ని కాస్త పైకెత్తి చూసి "హబ్బా... ఎంత లక్కీనో?.... పుసుక్... పుసుక్..." అన్నాడు దంతేశ్వర్రావ్.
"అంటే నా పంటికేం కాలేదా? .... బాగానే ఉందా?...." సంతోషంగా అడిగాడు ఆంజనేయులు.
"లక్కీ నీక్కాదయ్యా... నాకు." సంబరంగా అన్నాడు దంతేశ్వర్రావు.
"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు ఆంజనేయులు.
"ఎందుకేంటీ?... పన్ను నొప్పి అన్నావ్‌గా ... ఆ పన్నుమీది చిగురు రేక్కాయంత వాచింది... అందుకే నేను లక్కీ....."
"అంటే ఆ పన్ను పనికిరాదా?"
"అవును..."
"అలాగయితే ఆ పన్నును పీకడానికి ఎంత తీస్కుంటారు డాక్టర్‌గారూ?"
"నేను పన్నుని పీకడానికి యాభై తీస్కుంటానుగానీ నీ పన్నుని పీకకుండా ట్రీట్‌మెంట్ చేస్తా..."
"ఆ ట్రీట్‌మెంటయితే ఎంత తీస్కుంటారు?" అడిగాడు ఆంజనేయులు.
"మూడొందలు!! ..." అది చెప్తూ సంతోషంగా పుసుక్ పుసుక్ అని నవ్వాడు దంతేశ్వర్రావ్.
"హమ్మో ... అంతే!" గుండెలమీద చెయ్యేస్కున్నాడు ఆంజనేయులు.
"అందుకే కదా మరి నేను లక్కీ అని అంది... " పుసుక్ అన్నాడు దంతేశ్వర్రావ్..
"అయినా అంతెక్కువ ఫీజు ఎందుకు డాక్టర్?"
"ఎందుకంటే, నీ పంటికి రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ చెయ్యాలి గనుక! ... నువ్వు ఆర్రోజులపాటు రోజూ నా దగ్గరికొచ్చి ట్రీట్‌మెంట్ తీస్కోవాలి... రోజుకి యాభై రూపాయలు ఫీజు... కాబట్టి మొత్తం ట్రీట్‌మెంట్ మూడొందలు!!... పుసుక్.."
"హమ్మో... ఆర్రోజులు రావాలా? అంతేకాకుండా మూడొందలు

క్షవరమా?... అలాగయితే నాకా ట్రీట్‌మెంట్ వద్దు... యాభై రూపాయలిస్తా... నా పన్ను పీకెయ్యండి..." అన్నాడు ఆంజనేయులు.

"హమ్మో ... అంతీజీగా పన్ను పీకించేస్కుని వెళ్లిపోతే నేను లక్కీ ఎట్టాగవుతాను?... నువ్వు పన్ను పీకించుకోడానికి వీల్లేదు..." కొరకొర చూస్తూ అన్నాడు దంతేశ్వర్రావు.

"అదేంటి సార్... నా పన్నును నేను పీకించేస్కుంటానంటే వద్దంటారేం?" బిక్క మొహం వేస్తూ అన్నాడు ఆంజనేయులు.

"పన్ను పీకించేస్కుంటే నీకే నష్టం... నువ్వు కాస్త ఎక్కువగా నవ్వావనుకో... ఆ తొర్రిపన్ను కనిపిస్తుంది... హప్పుడు అందరూ తొర్రిపన్ను ఆంజనేలూ అని పిలుస్తారు... కొన్నాళ్లకి నీ ఇంటిపేరు పర్మనెంటుగా 'తొర్రిపన్ను' కింద మారిపోతుంది. అంతేకాదు... అలా పన్ను పీకడం వల్ల సందు ఏర్పడుతుంది కదా... దానివల్ల పక్కపళ్ళు బలహీనమై, అవికూడా కదిలి ఊడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది... అప్పుడు అందరూ తాతోయ్ ఆంజనేలూ అని పిలుస్తారు..." కొంటెగా చూస్తూ అన్నాడు దంతేశ్వర్రావు.

"అంతేనంటారా?...." బిక్కమొహం వేస్తూ అన్నాడు ఆంజనేయులు.

"అంతే - ముమ్మాటికీ అంతే. పళ్లు ఊడిపోతే నీ మాటకూడా తొస్సిబోతుంది... పుసుక్..."

"మరి మీ మాట తొస్సిపోలేదుకదా?..." లా పాయింటు లాగి విజయగర్వంతో చూశాడు ఆంజనేయులు.

"మొదట్లో నా మాట చాల తొస్సిపోయేది... కానీ రెండు మూడు సంవత్సరాలు ప్రాక్టీస్ చేసిన తర్వాత ఇప్పుడు చక్కబడింది.... ఇప్పటికీ నా నవ్వు తొస్సిపోతుంది. చూడు" అంటూ పుసుక్ పుసుక్‌మని నవ్వాడు. ఆంజనేయులుకి ఇంక తల వొంచక తప్పలేదు.

పంటినొప్పి, వాపు తగ్గడానికి డాక్టరు రాసిన మందులు వాడి, ఆర్రోజులు రోజూ వెళ్ళి రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ తీస్కుని డాక్టర్‌కి మూడొందలు సమర్పించుకున్నాడు.

"రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ చేయించుకున్న పన్ను చాల డెలికేట్ అయిపోతుంది. దానికి గోల్డు క్యాప్ తొడగాలి... లేకపోతే పన్ను విరిగిపోతుంది.... గోల్డు క్యాప్‌కి రెండొందలు అవుతుంది..." సంబరంగా అన్నాడు డాక్టర్ దంతేశ్వర్రావు.

అలాగే రెండొందలు పోసి పంటికి గోల్డు క్యాప్ తొడిగించుకున్నాడు అంజనేయులు.
ఒక నెల తర్వాత అంజనేయులు మూతి మళ్లీ వాచింది. అతను దంతేశ్వర్రావ్ దగ్గరికి పరుగుతీశాడు. అంజనేయుల్ని పరీక్షించి "కొంప మునిగిందయ్యా బాబూ... అప్పుడు నీకు ఒక పంటికి చెయ్యాల్సింది పోయి ఇంకో పంటికి ట్రీట్‌మెంటిచ్చాను" అన్నాడు దంతేశ్వర్రావ్. పుసుక్‌మని నవ్వుతూ.
అంజనేయులు గోల్డుపన్ను కనిపించేలా నోరు తెరిచి "బేర్ ర్...." అన్నాడు.

Usha

* * *